

సాహిత్యంతో మనో వికాసం
గ్రంథాలయాల ద్వారా విద్యార్థులకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించేలా చేసిన ప్రయత్నం సత్ఫలితాన్నిస్తోంది. విద్యార్థుల్లో నూతనోత్సాహం నింపింది. 8లో



క్యాంపస్ కళాశాలలో కొత్త కోర్సు
జేఎన్‌టీయూ(ఏ)లో బీటెక్‌లో కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ కోర్సు అమలుకు మార్గం సుగమమైంది. 8లో

గరిష్టం/కనిష్టం
38.1°/24.5°
జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు లేపాక్షికి గోవా ఆర్థిక మంత్రి

లేపాక్షి: గోవా ఆర్థిక శాఖ మంత్రి విశ్వజిత్‌రాణే సోమవారం ఉదయం లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయాన్ని సందర్శించనున్నారు. ఆయన ఆదివారమే బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో హిందూపురం చేరుకున్నారు. స్థానిక లాడ్జీలో రాత్రికి బస చేశారు. సోమవారం ఉదయం లేపాక్షి దేవాలయం సందర్శిస్తారు.

తుంగభద్ర డ్యాంకు మొదలైన వరద


తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: జిల్లా వరదాయిని అయిన తుంగభద్ర జలాశయం (టీబీ డ్యాం)కు వరద నీటి చేరిక మొదలైంది. కర్ణాటకలోని హొస్పేట వద్ద ఉన్న ఈ డ్యాంకు ప్రస్తుతం 411 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ భాగంలో కురిసిన వర్షాలతో ఆదివారం డ్యామ్‌లోకి ఇన్‌ఫ్లో మొదలైంది. సకాలంలో డ్యామ్ నిండితే జులై మొదటి లేదా రెండో వారంలో తుంగభద్ర ఎగువ కాలువ(హెచ్చెల్సీ)కు నీటిని వదిలే అవకాశం ఉంటుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,633 అడుగులకు గాను ఆదివారం 1,577.47 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలకు గాను ప్రస్తుతానికి 3.366 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అవుట్‌ఫ్లో 25 క్యూసెక్కులు ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 1580.70 అడుగుల వద్ద 4.820 టీఎంసీల నీరు నిల్వ ఉండేది.

నేటి నుంచి మద్యం దుకాణాల బంద్



పుట్టపర్తి టౌన్: లోక్‌సభ, శాసన సభ ఎన్నికల ఓట్ల లెక్కింపును దృష్టిలో ఉంచుకొని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు సోమవారం నుంచి మూడు రోజులపాటు జిల్లాలో మద్యం దుకాణాలు బంద్ చేయిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి సహదేవ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల నాలుగో తేదీన ఓట్ల లెక్కింపును దృష్టిలో ఉంచుకొని ఏపీ ఎక్సైజ్ చట్టం ప్రకారం కౌంటింగ్‌కు ముందు రోజు నుంచి నుంచి తర్వాత రోజు (ఐదో తేదీ) వరకు మద్యం, కల్లు దుకాణాలు, ఇతరత్ర ఎక్సైజ్ డిపార్టుమెంట్ నుంచి లైసెన్స్ పొందిన దుకాణాలు మూసివేయిస్తున్నట్లు పేర్కొన్నారు. మద్యం విక్రయదారులు, కొనుగోలుదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

భద్రత ఏర్పాట్లపై సమీక్ష


కౌంటింగ్ కేంద్రం వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ మాధవరెడ్డి

లేపాక్షి: చోళసముద్రం సమీపంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో భద్రపరిచిన ఈవీఎంలు, స్ట్రాంగ్ రూములను ఎస్పీ మాధవరెడ్డి ఆదివారం రాత్రి తనిఖీ చేశారు. అక్కడి భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు. ఆర్‌ఓలతో కలిసి కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారు. కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి సమస్యలూ తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, పుట్టపర్తి ఆర్‌ఓ భాగ్యరేఖ, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి
హిందూపురం: పట్టణంలోని బిట్ ఇంజినీరింగ్ కళాశాలలోని ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఆదివారం సాయంత్రం ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు. ఆర్‌ఓలతో కలిసి కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, పోలీస్ భద్రత ఏర్పాట్లను పరిశీలించి సూచనలు అందించారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పి సూచించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద నిరంతరం పోలీసులు అప్రమత్తంగా భద్రత ఉండాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, పుట్టపర్తి ఆర్‌ఓ భాగ్యరేఖ, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

రేపే కౌంటింగ్

సార్వత్రిక ఎన్నికలు–2024 చివరి ఘట్టానికి చేరుకున్నాయి. ఓట్ల లెక్కింపుతో ఎన్నికల అంకం ముగుస్తుంది. దీనికోసం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, విశ్లేషకులు, ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఈ నెల నాలుగో తేదీ చేపట్టే ఓట్ల లెక్కింపుతో అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది. 14.03 లక్షల మంది ఓటర్ల తీర్పు ఎలా ఉంటుందనే సంశయం వీడనుంది.

- తేలనున్న 104 మంది అభ్యర్థుల భవితవ్యం
- జిల్లాలో ఒక పార్లమెంటు, 7 అసెంబ్లీ నియోజక వర్గాలు
- కౌంటింగ్ నిబంధనలు కఠినతరం చేసిన ఈసీ
- మూడంచెల భద్రతతో కట్టుదిట్టం


కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు


కౌంటింగ్ కేంద్రంలో సిద్ధం చేసిన టేబుళ్లు

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల ఫలితాలపై నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో హిందూపురం పార్లమెంట్, రాప్తాడు, మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం, కదిరి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. పార్లమెంట్ స్థానానికి 13 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ప్రముఖంగా వైఎస్సార్‌సీపీకి, టీడీపీ కూటమికి మధ్య పోటీ ఉంది. ఇక అసెంబ్లీ స్థానాల్లో 91 మంది వివిధ రాజకీయ పార్టీల తరఫున, స్వతంత్రంగా బరిలో నిలిచారు. ఇక్కడా వైఎస్సార్‌సీపీకి టీడీపీకి మధ్యే పోటీ సాగింది. ధర్మవరంలో వైఎస్సార్‌సీపీకి, బీజేపీకి మధ్య పోటీ ఉంది. అన్ని పార్టీల గుర్తులతో పాటు 'నోటా' కూడా ఉంది.

కౌంటింగ్ నిబంధనలు కఠినతరం
ఓట్ల లెక్కింపులో భద్రతా ఏర్పాట్లు, కచ్చితమైన ఫలితాలను త్వరితగతిన వెల్లడించడానికి ఇప్పటికే ఎన్నికల సంఘం (ఈసీ) మార్గదర్శకాలను విడుదల చేసింది. ఓట్ల లెక్కింపు జరిగే లేపాక్షి గురుకుల పాఠశాల, హిందూపురం బిట్ కళాశాలలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, ఈసీ అనుమతి ఉన్న వ్యక్తులు, పరిశీలకులు, విధులు నిర్వర్తించనున్న అధికారులు, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుంది. కౌంటింగ్ సమయంలో ఎవరైనా ఏజెంట్ అనుచితంగా ప్రవర్తించినా, నిబంధనలు పాటించకపోయినా బయటకు పంపే అధికారం ఆర్‌ఓలకు ఉంటుంది.

- కౌంటింగ్ హాల్‌కు వంద మీటర్ల దూరంలో వాహనాలు నిలిపివేస్తారు. దీన్ని పెడస్ట్రియన్ జోన్ అంటారు. దీనిచుట్టూ బారికేడ్లు నిర్మిస్తారు. ఒక ప్రవేశ ద్వారముంటుంది. అక్కడ లోకల్ పోలీసులను నియమిస్తారు. ఇదే మూడంచెల భద్రతలో మొదటిది.
- స్ట్రాంగ్ రూం నుంచి కౌంటింగ్ గదులు దూరంగా ఉంటే ఈవీఎంలు తీసుకెళ్లడానికి అసౌకర్యంగా ఉంటుంది. దీంతో స్ట్రాంగ్ రూం డోర్ నుంచి కౌంటింగ్ హాల్ వరకు ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రదేశాన్ని రెండవ అంచెగా పరిగణిస్తారు. ఇక్కడ తగినంతమంది రాష్ట్ర సాయుధ బలగాలు ఉంటాయి.
- కౌంటింగ్ కేంద్రం ద్వారం నుంచి మూడో అంచె ప్రారంభం అవుతుంది. ఇక్కడ సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉంటారు. ఆర్‌ఓలు పిలిస్తే తప్ప వీరు కౌంటింగ్ హాల్‌లోకి ప్రవేశించరు. ఆడియో, వీడియో రికార్డు చేయగల మొబైల్ ఫోన్‌లు, ఐప్యాడ్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, లోపలకు అనుమతించరు. అలాగే అగ్గిపెట్లు, ఇంకు పెన్ను, బ్లేడ్‌లు, పిన్నులు, ఆయుధాలను లోనికి అనుమతించరు. పెన్సిల్, తెల్లకాగితం తీసుకెళ్లవచ్చు. కౌంటింగ్ ఏజెంట్లు, సిబ్బంది లోపలకు వెళ్లడానికి ప్రత్యేక ద్వారం ఉంటుంది. కౌంటింగ్ హాల్ బయట ఎవరూ ఫోన్‌లో మాట్లాడరాదు. మీడియా, పబ్లిక్ కమ్యూనికేషన్ రూంలో మాత్రమే ఫోన్‌లలో మాట్లాడవచ్చు. ఫోన్‌లు డిపాజిట్ కేంద్రంలో డిపాజిట్ చేయవచ్చు. ఏజెంట్లు తమకు కేటాయించిన టేబుల్ వద్ద మాత్రమే కూర్చోవాలి. కౌంటింగ్ హాల్ అంతా తిరగడానికి అనుమతి ఉండదు.

పోస్టల్ బ్యాలెట్‌తో ప్రారంభం
ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా ఈ నెల 4వ తేదీ ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో లెక్కింపు ప్రారంభమవుతుంది. బ్యాలెట్లు అన్నీ లెక్కించిన తర్వాతే ఫలితాన్ని వెలువరిస్తారు. 8.30 గంటలకు ఈవీఎంల లెక్కింపు ప్రారంభమవుతుంది. నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఓట్ల లెక్కింపునకు 827 మంది సిబ్బందిని నియమించి శిక్షణ పూర్తి చేశారు. మరో పక్క పోలీస్ శాఖ సైతం 879 మందితో మూడంచెల భద్రతతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. వీరికి ఇప్పటికే శిక్షణ పూర్తి చేశారు. మొత్తం 196 టేబుళ్లతో బాటు పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్లకు 28 టేబుళ్లు సిద్ధం చేశారు. 7 అసెంబ్లీ స్థానాలకు మొత్తం 137 రౌండ్లు ఉంటాయి. జిల్లాలో మొత్తం 14,03,259 ఓట్లు పోల్ కాగా.. 20,091 పోస్టల్ బ్యాలెట్లు, ఫారం 12డీ ఓట్లు నమోదయ్యాయి. సర్వీస్ ఓట్లు 573 ఉన్నాయి.

జిల్లాలో కౌంటింగ్ సమాచారం

పోలైన ఓట్లు	14,03,259
పోస్టల్ బ్యాలెట్ ఓట్లు	20,091
పోలింగ్ కేంద్రాలు	1,852
టేబుళ్లు	98
రౌండ్లు	137
కౌంటింగ్ సిబ్బంది	827
పోలీస్ సిబ్బంది	879
పార్లమెంట్ అభ్యర్థుల సంఖ్య	13
అసెంబ్లీ అభ్యర్థుల సంఖ్య	91

నైరుతి వచ్చె.. వర్షాలు తెచ్చె


అనంతపురం నగరంపై కమ్ముకున్న మేఘాలు

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం అగ్రికల్చర్/బుక్కరాయసముద్రం: జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు వచ్చేశాయి. ఆదివారం సాయంత్రం ఉమ్మడి అనంతపురం జిల్లాలోకి ప్రవేశించినట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. గత 20 ఏళ్లలో జూన్ 2న నైరుతి ప్రవేశించడం ఇది రెండో సారి మాత్రమే అని చెబుతున్నారు. ఈ సారి సాధారణం కన్నా కాస్త అధికంగా వర్షాలు నమోదవుతాయని భారత వాతావరణశాఖ ఇటీవల తీపి కబురు అందించిన విషయం తెలిసిందే.

వర్షాలపై గంపెడాశలు..
జిల్లావ్యాప్తంగా దాదాపు 3.50 లక్షల హెక్టార్లలో సాగులోకి వచ్చే ఖరీఫ్ పంటలకు నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురిసే వర్షాలే కీలకం. జిల్లా వార్షిక సాధారణ వర్షపాతం 512.4 మి.మీ కాగా, ఖరీఫ్ నాలుగు నెలల కాలంలో 319.7 మి.మీ నమోదు కావాలి. జూన్‌లో 61 మి.మీ, జూలైలో 63.9 మి.మీ, ఆగస్టులో 83.8 మి.మీ, సెప్టెంబర్‌లో 110.9 మి.మీ సాధారణ వర్షపాతంగా నిర్ధారించారు. అక్టోబర్– డిసెంబర్ వరకు రబీలో ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తాయి. నైరుతి, ఈశాన్యం మంచి ప్రభావం చూప డంతో 2019 నుంచి 2022 వరకు కరువు తీరేలా వర్షాలు కురిశాయి. 2023 ఖరీఫ్‌లో మాత్రమే వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సారి నైరుతి ప్రభావంతో సాధారణం కన్నా అధికంగానే వర్షపాతం నమోదు కావచ్చని ఇప్పటికే వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో రైతులు ఖరీఫ్‌పై ఆశలు పెట్టుకున్నారు.

నిబంధనలు కచ్చితంగా పాటించాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకులు

హిందూపురం: ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు అన్బుకుమార్, దీపక్ రామ్‌చంద్ర తివారి సూచించారు. ఆదివారం బిట్ కళాశాలలో హిందూపురం, కదిరి, పెనుకొండ, మడకశిర అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ అధికారులు, సిబ్బందికి నిర్వహించిన రెండో విడత శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌తోపాటు ఆర్‌ఓలతో జరిగిన సమావేశంలో హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ అన్బుకుమార్ హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ శిక్షణలో మాట్లాడారు. కౌంటింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలన్నారు. పెనుకొండ నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ దీపక్ రామ్‌చంద్ర తివారి మాట్లాడుతూ కౌంటింగ్‌లో సూక్ష్మ పరిశీలకులకు ప్రతి రౌండూ కీలకమన్నారు. కచ్చితమైన వివరాలను నమోదు చేస్తూ పొరపాట్లకు తావులేకుండా చూసుకోవాలన్నారు. అభ్యర్థుల వారీగా వచ్చిన ఓట్లను ఏజెంట్లకు చూపించి, వారినుంచి సంతకాలు తీసుకోవాలన్నారు. ఈవీఎం మిషన్లను తీసుకువచ్చేటప్పుడు, ఓట్లను లెక్కించేటప్పుడు మిషన్లు పాడవకుండా తగిన జాగ్రత్తలతో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను సక్రమంగా, సజావుగా పూర్తి చేయడంలో మైక్రో అబ్జర్వర్ పాత్ర ఎంతో ముఖ్యమైనదని తెలియజేశారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు అన్బుకుమార్, చిత్రంలో కలెక్టర్ అరుణ్‌బాబు

బాధ్యతగా నడుచుకోవాలి
కౌంటింగ్ విధుల్లో అధికారులు సమయపాలన పాటిస్తూ బాధ్యతగా నడుచుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. కౌంటింగ్ అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం ఉదయం 6 గంటలకే కౌంటింగ్ అధికారులు, సిబ్బంది ఆయా కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. పూర్తిస్థాయి ఫలితాలు వెల్లడయ్యే వరకు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు కౌంటింగ్ సిబ్బందికి అన్ని విధాలా సహకరించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి ఐడీ కార్డులతో హాజరుకావాలని ఆదేశించారు.

- ఈవీఎంల కౌంటింగ్ కోసం ప్రతి టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, కౌంటింగ్ స్టాఫ్ ఒకరు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని కలెక్టర్ తెలిపారు. ప్రతి టేబుల్ వద్ద పోస్టల్ బ్యాలెట్ కోసం ఒక సహాయ రిటర్నింగ్ అధికారి, కౌంటింగ్ సూపర్ వైజర్, ఇద్దరు కౌంటింగ్ అధికారులు, ఒక మైక్రో అబ్జర్వర్‌లు ఉంటారన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆర్వోలను సూచించారు. అలాగే ఈటీపీబీస్‌కు సంబంధించి ప్రతి టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఒకఅసిస్టెంట్, ఎఆర్‌ఓ ఉంటారని తెలియజేశారు. అంతకు మునుపు లేపాక్షిలోని గురుకుల పాఠశాలలో పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గ సంబంధించి కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో కదిరి ఆర్‌ఓ వంశీకృష్ణ, మడకశిర ఆర్‌ఓ గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు కౌంటింగ్ అబ్జర్వర్ స్నేహల్ నాయక్ గోల్టేకర్, ధర్మవరం ఆర్‌ఓ వెంకట శివసాయిరెడ్డి, పుట్టపర్తి ఆర్‌ఓ భాగ్యరేఖ, జిల్లాలోని ఆయా నియోజకవర్గాల సహాయ ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు

- నిబంధనలు అతిక్రమిస్తే కేసులు
- ఎస్పీ మాధవరెడ్డి హెచ్చరిక


మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ రోజు లేపాక్షి గురుకుల పాఠశాల, హిందూపురంలోని బిట్ కళాశాలలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఆరో తేదీ వరకు 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ అనంతరం ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం నిషేధం అన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, నిరంతరం డ్రోన్ కెమెరాలతో నిఘా పటిష్టం చేశామన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎలాంటి అల్లర్లకు పాల్పడినా, సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే వాఖ్యలు చేసినా, నిబంధనలు ఉల్లంఘించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

బందోబస్తుకు సిబ్బంది కేటాయింపు
కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు ఇద్దరు ఎస్పీలు, ముగ్గురు ఏఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 42 మంది సీఐలు, 68 మంది ఎస్‌ఐలు, 326 మంది ఏఎస్‌ఐలు, 500 మంది పోలీసులు, 300 మంది హోంగార్డులు, 60 మంది మహిళా పోలీసులు, 120 మంది ఏఆర్ పోలీసులు, 80 మంది ఏపీఎస్పీ పోలీసులతో పాటు 110 కేంద్ర సాయుధ బలగాలు, గ్రేహౌండ్స్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా

అనంతపురం: డిప్లొమా కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ఏపీ పాలిసెట్–2024లో భాగంగా సోమవారం నిర్వహించాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి తెలిపారు. 3న జరగాల్సిన సర్టిఫికెట్ల పరిశీలనను 6న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఈ మేరకు షెడ్యూల్ మార్పు చేశామన్నారు. అదే విధంగా వెబ్‌ఆప్షన్లు ఈ నెల 7 నుంచి ఇచ్చుకోవచ్చునని పేర్కొన్నారు.

నవవిధ భక్తి మార్గాలతో ముక్తి


నృత్యరూపకంలోని ఒక ఘట్టం


సంగీత కచేరీ నిర్వహిస్తున్న తమిళనాడు సత్యసాయి భక్తులు

ప్రశాంతి నిలయం: మానవుడు నవవిధ భక్తి మార్గాల ద్వారా ముక్తిని పొందవచ్చన్న సందేశాన్నిస్తూ బాలవికాస్ చిన్నారులు చక్కటి నృత్యరూపకం ప్రదర్శించారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన తమిళనాడు భక్తులు ఆదివారం సత్యసాయి సన్నిధిలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయి ధ్వని పేరుతో నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను పరవశింపజేసింది. సాయంత్రం తమిళనాడు బాలవికాస్ చిన్నారులు పురాణ ఇతిహాసాలను ఇతివృత్తంగా చేసుకుని నవవిధ భక్తి పేరుతో నృత్యరూపకం ప్రదర్శించారు. భక్తులు అనుసరించిన విభిన్న మార్గాలను, నిత్య జీవితంలో భగవంతున్ని ప్రసన్నం చేసుకోవడానికి ఆచరించాల్సిన మార్గాలను చక్కగా వివరించారు.

జిల్లా వ్యాప్తంగా వర్షాలు

పుట్టపర్తి అర్బన్: జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిశాయి. శనివారం రాత్రి పొద్దుపోయాక కొన్ని మండలాల్లో వర్షం దంచికొట్టింది. ముదిగుబ్బ మినహా తతిమా 31 మండలాల్లోనూ వర్షం కురిసింది. కనగానపల్లి మండలంలో 54.2 మి.మీ, చిలమత్తూరులో 51.2, ఎన్‌పీ కుంటలో 44.2, కొత్తచెరువులో 42.2, గోరంట్లలో 40, పెనుకొండలో 40, రామగిరిలో 33.4, పుట్టపర్తిలో 29.8, కదిరిలో 27.2, గాండ్లపెంటలో 26.8, సీకేపల్లిలో 22.6, నల్లచెరువులో 22.4, అమడగూరులో 21.6, బుక్కపట్నంలో 16.4, ఓడీ చెరువులో 16.2, సోమందేపల్లిలో 15.4, హిందూపురంలో 14.8, పరిగిలో 14.2, నల్లమాడలో 13.2, రొళ్ల 10.4, ధర్మవరం, తనకల్లులో 9.6, మడకశిరలో 9.2, గుడిబండలో 8.8, లేపాక్షిలో 8.2, రొద్దంలో 7.6, అమరాపురంలో 6.2, తాడిమర్రిలో 5.8 బత్తలపల్లి, అగళిలో 3.4, తలుపులలో 2.8 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్లు చెప్పారు.


కొత్తచెరువు మండలం లోచర్ల వద్ద ఈదురుగాలులకు నేలకొరిగిన చింతచెట్టు


గోరంట్ల మండలం కరావులపల్లి వద్ద భారీ వర్షానికి పొలంలో నిలిచిన నీరు


పుట్టపర్తి మండలం పెదపల్లి వద్ద పొలంలో మడుగును తలపిస్తున్న వర్షపు నీరు

క్లుప్తంగా

కుక్కల దాడిలో 24 గొర్రెల మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

ఎన్పీకుంట: మండలంలోని ఎస్.కె.తండాలో వీధి కుక్కలు స్వైరవిహారం చేయడంతో ఇస్లావత్ రవినాయక్‌కు చెందిన సుమారు 24 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. బాధితుడు తెలిపిన మేరకు... శనివారం సాయంత్రం ఇంటి వద్ద దొడ్డిలోకి గొర్రెల మందను వదిలి నిద్రపోయారు. ఆదివారం తెల్లవారుజామున దాదాపు 25 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. సమాచారం అందుకున్న పశువైద్యాధికారి డాక్టర్ బాలానాయక్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందినట్లు నిర్ధారించారు. అప్పు చేసి 100 గొర్రెల పోషణ చేపడితే 24 జీవాలను కుక్కల పొట్టన పెట్టుకున్నాయని, దీంతో రూ.2.50 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరి వాపోయాడు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



పాలయ్య (ఫైల్)

గుమ్మఘట్ట: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం గలగలపైదొడ్డి గ్రామానికి చెందిన పాలయ్య (48)కు భార్య మాంతక్క, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో తాను సాగు చేసిన టమాట పంటకు నీరు పెట్టేందుకు ఆదివారం ఉదయం వెళ్లిన ఆయన మోటార్ స్విచ్ ఆన్ చేసే క్రమంలో స్టార్టర్ పెట్టెను తాకాడు. అప్పటికే షార్ట్ సర్క్యూట్ కారణంగా స్టార్టర్ పెట్టెకు విద్యుత్ ప్రసారమువుతున్న విషయాన్ని పాలయ్య గుర్తించలేకపోయాడు. దీంతో కరెంట్ షాక్‌కు గురై కుప్పకూలాడు. గమనించిన తోటి రైతులు వెంటనే రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు,భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.

సాహిత్యంతో మనోవికాసం

ప్రస్తుతం బాలలకు సెల్‌ఫోన్‌లే ఓ ప్రపంచం.. పుస్తక పఠనం మరిచారు.. ఆటపాటల ఊసే లేదు. ఇలాంటి పరిస్థితుల నుంచి బయటపడేసేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ వేసవి వినోదానికి శ్రీకారం చుట్టింది. మరో పది రోజుల్లో వేసవి సెలవులు ముగియనున్నాయి. ఈ క్రమంలో గ్రంథాలయాల ద్వారా విద్యార్థులకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించేలా చేసిన ప్రయత్నం సత్ఫలితాన్ని అందజేసింది. రోజూ వినూత్న రీతిలో అందించిన శిక్షణ కార్యక్రమాలు విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి.

- సత్ఫలితాన్నిచ్చిన గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరాలు
- జిల్లాలో వేలాది మంది చిన్నారులకు లబ్ధి



హిందూపురంలోని గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు



తాము నేర్చుకుని వేసిన పెయింటింగ్‌లను చూపుతున్న చిన్నారులు

హిందూపురం టౌన్: వేసవి సెలవులు వచ్చాయంటే చాలు వెంటనే బంధువుల ఇళ్లకో.. విహారయాత్రలకో వెళ్లడం షరా మాములే. అయితే పోటీ ప్రపంచంలో వేసవి సెలవులను సైతం సద్వినియోగం చేసుకునేలా ఇటీవల తల్లిదండ్రులు ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకుంటున్నారు. ఈ క్రమంలో పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించడంపై దృష్టి సారిస్తున్నారు. వేసవి సెలవులను వృథా కానివ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పంచే చర్యలు ముమ్మరం చేసింది. గ్రంథాలయాల్లో పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనంతో పాటు క్రీడలు, ఆటపాటలు, ఆత్మరక్షణ విద్య నేర్పేలా ప్రణాళికను సిద్ధం చేసి పటిష్టంగా అమలు చేస్తోంది. ఈ శిక్షణా కార్యక్రమాలు సత్ఫలితాన్ని ఇవ్వడంతో పిల్లలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రంథాలయాలలో విజ్ఞానం

మనం ఎలాంటి విత్తనాలు నాటితే అలాంటి చెట్లే వస్తాయి. బాల్యం నుంచే మంచి సాహిత్యం అందిస్తే మంచి వ్యక్తిత్వం గల పౌరులు తయారవుతారు. కొత్త విషయాలు, మంచి సంగతులు, జీవితానికి, భవిష్యత్తుకి పనికొచ్చే సూత్రాలు తెలుసుకుంటున్నామన్న అభిప్రాయం కలిగితేనే ఎవరైనా పుస్తకాలు చదువుతారు. గ్రంథాలయాల్లోని ఈ తరహా పుస్తకాలు వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానాన్ని పంచాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 70 శాఖా గ్రంథాలయాల్లో జరుగుతున్న శిక్షణా తరగతుల్లో 2,200 మందికిపైగా విద్యార్థులు రోజూ పాల్గొంటున్నారు. ఈ నెల 7వ తేదీ వరకూ ఈ శిక్షణ కొనసాగనుంది.

ఉల్లాసంగా క్రీడల్లో..

పుస్తక పఠనానికే కాకుండా క్రీడల్లోనూ శిక్షణ పొందేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతూ ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫుట్‌బాల్, క్రికెట్, హ్యాండ్ బాల్, వాలీబాల్, హాకీ, కబడ్డీ, కరాటే, బాక్సింగ్, జూడో, బాల్ బ్యాడ్మింటన్, ఖోఖో, రైఫిల్ షూటింగ్, టేబుల్ టెన్నిస్, సాఫ్ట్ బాల్ తదితర క్రీడలతో పాటు ఆత్మరక్షణ విద్యను విద్యార్థులు నేర్చుకోవడానికి ఇష్టపడుతున్నారు. ఈ క్రమంలో వేసవిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. క్రీడల ద్వారా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండడమే కాక శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతున్నారు.

ఇంగ్లిష్‌పై పట్టు పెరిగింది



హిందూపురంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. వేసవి సెలవుల్లో గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరానికి క్రమం తప్పకుండా హాజరయ్యాను. ఇంగ్లిష్‌పై పట్టు పెరిగింది. డ్రాయింగ్ వేయడాన్ని నేర్చుకున్నా. కథల పుస్తకాలు చదవడానికి బాగున్నాయి.

– హర్షవర్ధన్, విద్యార్థి, హిందూపురం

ఫుట్‌బాల్ నేర్చుకున్నా



నాకు ఫుట్‌బాల్ అంటే ఇష్టం. ఈ వేసవి శిక్షణా శిబిరంలో ఫుట్‌బాల్ ఆడడం నేర్చుకున్నా. వేసవి సెలవులను వృథా చేయకుండా మాకు ఇష్టమైన క్రీడల్లో శిక్షణ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది.

– వైద్విత హరిణి, హిందూపురం

అల్లనేరేడు.. ఆరోగ్యానికి ఎంతో మేలు



అల్లనేరేడు పండ్లు

రాయదుర్గంటౌన్: అల్లనేరేడు పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. నిగనిగలాడే అల్లనేరేడు పండ్లతో ఆరోగ్యంతోపాటు ఆదాయం సమకూరుతుంది. అల్లనేరేడు పండ్లు తినడానికి పిల్లలు, పెద్దలు ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. రుచిలోనే కాదు.. ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయని వైద్యులు చెప్తున్నారు. వ్యాధి నిరోధక శక్తి పెంపొందించడంతోపాటు షుగర్ వ్యాధిగ్రస్తులకు అల్లనేరేడు దివ్య ఔషధంగా పనిచేస్తాయి. ఈ గింజలను పొడి రూపంలో చేసుకుని తింటే ఫలితం ఉంటుంది. అంతేకాక కడుపులో పేరుకుపోయిన మలినాలు బయటకు వెళ్లేందుకు ఈ పండ్లు దోహదపడతాయని ఆయుర్వేద వైద్యులు సైతం సూచిస్తున్నారు. ప్రస్తుతం అల్లనేరేడు పండ్ల సీజన్ ప్రారంభమైంది. స్థానికంగా బొమ్మనహాళ్ మండలం ఎల్‌బీ నగర్ ప్రాంతంతోపాటు కర్ణాటక నుంచి అల్ల నేరేడు పండ్లు తెచ్చి మార్కెట్‌లో అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో అల్లనేరేడు రూ.200 ప్రకారం విక్రయిస్తున్నారు.

నగరంలోకి బయటి వ్యక్తులకు నో ఎంట్రీ

అనంతపురం అర్బన్: ఓట్ల లెక్కింపు రోజు ఈ నెల 4వ తేదీన అనంతపురం నగరంలోకి బయటి వ్యక్తులు ఎవరూ ప్రవేశించడానికి అనుమతి లేదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఇందుకు సంబంధించి వివరాలను ఆయన ఆదివారం తెలియజేశారు. కౌంటింగ్ ఏజెంట్లు నగరంలోని లాడ్జీలు, హోటళ్లు, కమ్యూనిటీ హాళ్లు, షాదీ ఖానాలు, కళ్యాణ మండపాల్లో బస చేసేందుకు సోమవారం రాత్రికి రావాలని చెప్పారు. ఇతర జిల్లాలకు చెందిన కుటుంబాలు, వారి కుటుంబ సభ్యులు, మతపరమైన వాళ్లను మాత్రమే నగరంలోకి అనుమతిస్తారన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలోని లాడ్జీలు, హోటళ్లు, కమ్యూనిటీ హాళ్లు, షాదీ ఖానాలు, కళ్యాణ మండపాల్లో బస చేసేందుకు వచ్చే వారి గుర్తింపు కార్డులు, పూర్తి వివరాలను యాజమాన్యం తీసుకోవాలన్నారు. ఏజెంట్లు కాకుండా బయటి వ్యక్తులు ఎవరినీ అనుమతించకూడదన్నారు. లాడ్జీలు, హోటళ్లు, కమ్యూనిటీ హాళ్లు, షాదీ ఖానాలు, కళ్యాణ మండపాలను పరిశీలించే బాధ్యతలను వీఆర్‌ఓలకు అప్పగించామన్నారు. ఇతరులను ఇళ్లలో ఉంచుకోకూడదని తెలియజేస్తూ జేఎన్‌టీయూ పరిసరాల్లోని నివాసాలకు నోటీసు ఇచ్చామన్నారు. ఏ విషయంలోనూ పోలీసులకు తప్పుడు సమాచారం ఇవ్వకూడదన్నారు. ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గార్లదిన్నెకు చేరుకున్న పాదయాత్ర



జైన మత సిద్ధాంతాలు వివరిస్తున్న దిగంబర స్వామి

గార్లదిన్నె: జైన మత దిగంబర స్వాముల పాదయాత్ర ఆదివారం గార్లదిన్నెకు చేరుకుంది. వివరాలు.. జైన మతానికి చెందిన అంతర్మాన ప్రసన్న సాగర గురువుతో పాటు 17 మంది దిగంబర స్వాములు కర్ణాటకలోని గోమటేశ్వర స్వామి ఆలయం నుంచి హైదరాబాద్‌లోని కుల్‌చారమ్ జైన దేవాలయం వరకూ ఏప్రిల్ 25న పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. శనివారం రాత్రి రాప్తాడులో బస చేసి, ఆదివారం ఉదయం పాదయాత్ర ప్రారంభించి గార్లదిన్నెకు చేరుకున్నారు. రాత్రికి జిల్లా పరిషత్ హైస్కూల్లో బస చేశారు. ఈ సందర్భంగా అక్కడ భక్తులకు స్వాములు జైన మత సిద్ధాంతాలను వివరించారు. ప్రజలు సంతోషంగా ఉండాలని పాదయాత్ర చేస్తున్నట్లు వారు తెలిపారు.

బొమ్మనహాళ్‌లో భారీ వర్షం



ఉద్దేహాళ్ వద్ద ప్రవహిస్తున్న వేదావతి హగరి నది



నీట మునిగిన పత్తి పంట

బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కుండపోతగా వాన కురిసింది. మండలంలో రాత్రి 10 గంటల నుంచి 12.30 గంటల వరకు వర్షం వదిలిపెట్టకుండా కుండపోతగా కురిసింది. దీంతో 27.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి పత్తి పంటలు నీట మునిగింది. పలుచోట్ల వృక్షాలు, విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భారీ వర్షానికి కొలగానహళ్లి వద్ద కబ్బాల్ వంక, ఉద్దేహాళ్ వద్ద వేదావతి హగరి నది వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. శ్రీధరఘట్ట చెరువుకు నీరు చేరాయి.

నేడు రుక్మిణీ పాండురంగ స్వామి రథోత్సవం



ఉంతకల్లులో వెలసిన రుక్మిణీ పాండురంగ స్వామి

బొమ్మనహాళ్: ఆంధ్ర పండరీపురంగా ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 3న ఉదయం రుక్మిణీ పాండురంగ స్వామికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు అనంతరం పల్లకీ మహోత్సవం ఉంటుందన్నారు. అనంతరం రథోత్సవం ఉంటుందన్నారు. ఆలయం నుంచి ప్రధాన వీధిలోని ఎదురు బసవన్న ఆలయం వరకు లాగుతున్నట్లు తెలిపారు. రథోత్సవానికి పండరీపుర పీఠాధిపతి గోపాల్‌రాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రథోత్సవం లాగుతున్నట్లు తెలిపారు. పండరీపుర పీఠాధిపతి గోపాల్‌రాజ్ చేతుల మీదుగా భక్తులు పాండురంగస్వామి మాలాధారణ చేసుకోవచ్చని తెలిపారు. రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీరంగాపురం క్యాంపులో రైతు కావలి దేవేంద్రకు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో ఆదివారం ఉదయం మృతిచెందింది. రైతు కావలి దేవేంద్ర ఇంటి వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు తెగి గేదెపై పడడంతో మృతిచెందింది. అప్పు చేసి గేదెను కొనుగోలు చేశానని, రూ.50 వేలు నష్టపోయినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

పొంగి పొర్లుతున్న వంకలు



పాల్తూరు-దర్గాహొన్నూరుకు వెళ్ళే మార్గంలో వరద నీటితో పారుతున్న పెద్ద వంక

విడపనకల్లు: మండల వ్యాప్తంగా శనివారం రాత్రి భారీగా వర్షం కురిసింది. దీంతో ఆదివారం వాగులు వంకలు, వరద నీటితో పోటెత్తాయి. మండలంలోని పాల్తూరు, గాజుల మల్లాపురం, పాలికి, ఆర్.కొట్టాల డొనేకల్లు వద్ద ఉన్న వంకలు పెద్ద ఎత్తున వరద నీటితో ఉధృతంగా పొంగి పొర్లింది. భారీ వర్షం కురవడంతో వ్యవసాయ పొలాల్లో సైతం నీరు నిలిచింది. ఉండబండ, పాల్తూరు గ్రామాల మధ్య వంకలు గంటల తరబడి వరద నీటితో పొంగి పొర్లడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

క్యాంపస్ కళాశాలలో కొత్త కోర్సు

- ఇప్పటి వరకు జేఎన్‌టీయూలో కేవలం ఆరు బ్రాంచ్‌లు మాత్రమే
- తాజాగా కంప్యూటర్ సైన్సెస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సు ఏర్పాటుకు ఏఐసీటీఈ అనుమతి
- బీటీహెచ్ స్వీడన్ వర్సిటీతో అవగాహన ఒప్పందం
- తొలి మూడేళ్లు జేఎన్‌టీయూఏలో, చివరి సంవత్సరం స్వీడన్‌లో విద్యాభ్యాసం
- రెండు వర్సిటీలు సంయుక్తంగా డిగ్రీల ప్రదానం



జేఎన్‌టీయూ అనంతపురం ఇంజనీరింగ్ కళాశాల

అనంతపురం: మారుతున్న కాలానికి అనుగుణంగా, పరిశ్రమల అవసరాలకు దీటుగా మానవ వనరులను అందించే క్రమంలో జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలో సరికొత్త కోర్సును అమలు చేసేందుకు సన్నాహకాలు సాగుతున్నాయి. 78 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన జేఎన్‌టీయూఏ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రతిష్టాత్మక బ్రాంచ్‌లతో పాటు నిష్ణాతులైన అధ్యాపకులూ ఉన్నారు. ఈ క్రమంలో బీటెక్‌లో కొత్త కోర్సు అమలుకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) అనుమతులు జారీ చేసింది. దీంతో బీటెక్‌లో కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ కోర్సు అమలుకు మార్గం సుగమమైంది. ఇది వరకు జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలో మెకానికల్, సివిల్, కంప్యూటర్ సైన్సెస్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్ కోర్సులు మాత్రమే ఉన్నాయి. తాజాగా కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ కోర్సుతో 7 బ్రాంచ్‌లు కానున్నాయి.

మెరుగైన ఉపాధి అవకాశాలు..

అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి దక్కించుకున్న జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలో బీటెక్ పూర్తి చేయాలనే ఆకాంక్ష ఎంతో మంది విద్యార్థులకు ఉంది. ఏటా క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా పేరెన్నిక గల బహుళజాతి సంస్థల్లో 350 మందికి పైగా విద్యార్థులు కొలువులు దక్కించుకుంటున్నారు. దీంతో ఈ కళాశాలలో ఇంజినీరింగ్ అడ్మిషన్లకు భారీగా డిమాండ్ నెలకొంది. అత్యుత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థులు తమ తొలి ఆప్షన్‌ను జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలకే ఇస్తుండడం ఇందుకు నిదర్శనం. దీంతో ఏపీఈఏపీసెట్ (గతంలో ఎంసెట్) గణనీయమైన ర్యాంకులు దక్కిన వారికే జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలో సీటు దక్కుతుంది. ఈ క్రమంలో బీటెక్‌లో అదనంగా ఓ బ్రాంచ్ ఏర్పడితే గొప్ప సదావకాశంగా భావిస్తారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్, కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో మొత్తం 360 ఇంజినీరింగ్ సీట్లు ఉన్నాయి. తాజాగా కొత్త బ్రాంచ్ ఏర్పడితే మరో 60 ఇంజినీరింగ్ సీట్లు వస్తాయి. ప్రస్తుత మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలో ప్రవేశపెడితే రాయలసీమ ప్రాంత విద్యార్థులకు గొప్ప అవకాశం దక్కినట్లే.

విదేశీ విద్యార్థులకు ఆహ్వానం..

జేఎన్‌టీయూఏకు న్యాక్ -ఏ గ్రేడ్ హోదా దక్కడం, అన్ని విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపుతో పాటు ఎన్ఐఆర్‌ఎఫ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) ర్యాంక్ కలిగి ఉండడంతో విదేశీ విద్యార్థులు సైతం ఇక్కడ చదువుకోవడానికి వీలు కలుగుతోంది. ఈ విషయంగా విదేశీ విద్యార్థులకు ఐసీఎస్ఎస్ఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్) అండగా నిలుస్తోంది. ఆసక్తి గల విద్యార్థులు వర్సిటీకి దరఖాస్తు చేసుకుంటే ఐసీఎస్ఎస్ఆర్ ఉపకారవేతనాలు అందుతాయి. విదేశీ విద్యార్థులు ఇక్కడ చదువుకుంటే పరస్పర ఆలోచనా మార్పిడి, పరిశోధన, అధ్యయనంలో ఒకరి ఆలోచనలు మరొకరు పంచుకోవడం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందడంతో పాటు సంస్కృతీసంప్రదాయాలపై మరింత గౌరవ భావం పెరుగుతుంది. ఈ ఉద్దేశ్యంతో విదేశీ విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశం కల్పిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటివరకూ 30 మంది విదేశీ విద్యార్థులు జేఎన్‌టీయూఏలో బీటెక్, ఎంబీఏ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి కనబరుస్తూ దరఖాస్తు చేసుకున్నారు.

బీటీహెచ్‌తో సంప్రదింపులు..

స్వీడన్‌లోని బ్లెకింగ్ వర్సిటీ భాగస్వామ్యంతో జేఎన్‌టీయూఏలో ఇంటిగ్రేటెడ్ కోర్సుల అమలవుతున్నాయి. ఈ కోర్సు ద్వారా బీటెక్ బ్రాంచ్‌లో తొలి మూడేళ్లు జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలో చదవాల్సి ఉంటుంది. చివరి ఏడాది స్వీడన్‌లోని బీటీహెచ్‌లో పూర్తి చేయాల్సి ఉంటుంది. అనంతరం రెండేళ్లు ఎంఎస్ కోర్సును స్వీడన్‌లో అభ్యసించవచ్చు. డిగ్రీని జేఎన్‌టీయూఏ, బీఎస్ పట్టాను బ్లెకింగ్ వర్సిటీ (బీటీహెచ్) స్వీడన్ ప్రదానం చేస్తాయి. కంప్యూటర్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ ప్రోగ్రామ్‌లో మొత్తం 30 సీట్లు భర్తీ చేయనున్నారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ కోర్సు పూర్తి చేసిన వారు అర్హులు. కనీసం 70 శాతం మార్కులు పొంది ఉండాలి. జేఈఈ మెయిన్స్-2024, ఏపీఈఏపీసెట్-2024, టీఎస్ ఈఏపీసెట్-2024 ర్యాంకు ఆధారంగా అడ్మిషన్లు కల్పిస్తారు. అర్హత సాధించిన విద్యార్థులకు బీటీహెచ్-స్వీడన్ మెరిట్ ఆధారిత ఉపకారవేతనాలు అందుతాయి. ఈ నెల 6న వెబ్‌నార్ నిర్వహించి నోటిఫికేషన్ తేదీలను ఖరారు చేయనున్నారు.

పాలక మండలి ఆమోదమే తరువాయి



జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలో కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లర్నింగ్ కోర్సు ప్రవేశపెట్టడానికి ఏఐసీటీఈ అనుమతులు మంజూరయ్యాయి. పాలకమండలి ఆమోదం పొందిన తర్వాత ఈ కోర్సు అమలు చేస్తాం. సెల్ఫ్ ఫైనాన్స్ కింద భర్తీ చేయాలా? లేక నేరుగా ఏపీఈఏపీ సెట్ ర్యాంక్ ఆధారంగా భర్తీ చేయాలా అనే అంశంపై పాలకమండలి స్పష్టత ఇవ్వనుంది.

– డాక్టర్ జీవీఆర్ శ్రీనివాసరావు, వీసీ, జేఎన్‌టీయూఏ